క్లుప్తంగా

దఫేదార్ల సంఘం గౌరవ అధ్యక్షుడిగా రామనారాయణ



ఏకగ్రీవంగా రామనారాయణను ఎన్నుకున్న సంఘం సభ్యులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ దఫేదార్ల సంఘం గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ రామనారాయణను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకుని సత్కరించారు. ఏర్పాటైన దఫేదార్ల సంఘం రిజిస్ట్రేషన్, రిక్రియేషన్ రూమ్, డైనింగ్ రూమ్, జీవీఎంసీ వైద్యుల ద్వారా హెల్త్ చెకప్‌పై చర్యలు, యూనిఫాం, క్లాస్‌ఫోర్‌గా ఉన్న వారికి పదోన్నతి కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విషయమై రామనారాయణను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ జాతర రాట మహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ విల్లూరి

దాబాగార్డెన్స్: నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణం వద్ద ఉత్సవ రాట అత్యంత వైభవంగా నిర్వహించారు. నాదస్వరాలు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించిన రాట మహోత్స కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాంద్రేగుల రూపావతి, రమణమ్మ, చిన్ని గోపాలకృష్ణతో పాటు నాయకులు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల సంగీత విభావరి

సీతంపేట: అమర గాయకుడు ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా రాగమాలిక ఆధ్వర్యంలో విశాఖ పౌరగ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. కేవీ సత్యనారాయణ, పార్థసారథి, ఇందిర, బొమ్మిడి సత్యనారాయణ, మీనాకుమారి, మహమ్మద్‌ఖాన్, గీత, శ్రీనివాస్, అంజలి, జి.సత్యనారాయణ, భరద్వాజ్ తదితరులు ఘంటసాల హిట్‌సాంగ్స్ ఆలపించి అలరించారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, కొణతాల రాజు, పల్లా వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కీబోర్డుపై సోమేష్, తబలాపై శివ, ప్యాడ్స్‌పై శ్యామ్, గిటార్‌పై నాగు చక్కని వాద్య సహకారం అందించారు.

వ్యక్తి ఆత్మహత్య

అల్లిపురం: మద్యానికి బానిసై ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరంగపురం, గోకుల్‌పార్క్ ప్రాంతానికి చెందిన బొట్టా సత్యనారాయణ (45) రామాటాకీస్ వద్ద సన్ మెడికల్స్‌లో పని చేస్తున్నాడు. వారం రోజులుగా విధులకు వెళ్లకుండా అతిగా మద్యం తీసుకుని రోడ్ల మీద తిరుగుతున్నాడు. శుక్రవారం ఉదయం మృతుడు తన భార్య సత్యవతిని ఆమె పని చేస్తున్న ఇంటి వద్ద దింపి తిరిగి ఏఎస్ బీచ్ వద్ద గల తల్లి ఇంటికి వెళ్లాడు. సత్యవతికి ఆమె అత్త ఫోన్ చేసి తన కుమారుడు మద్యం తాగి పడుకున్నాడని తెలిపింది. శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఇంటికి వెళ్లి కిటికీ ద్వారా చూడగా సత్యనారాయణ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సహకారంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న

- ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం ప్రతి కుటుంబానికి తెలపాల్సిన బాధ్యత కన్వీనర్లు, గృహసారథులదే
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి



కన్వీనర్లు, గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: మా నమ్మకం నువ్వే జగనన్న అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమం శనివారం నియోజకవర్గ పరిధి మహారాణిపేటలో గల అంబికాబాగ్ రామాలయ కల్యాణమండపంలో నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల్లో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శతశాతం విజయమే లక్ష్యంగా పార్టీ క్యాడర్‌ను బలోపేతం చేస్తూ, ప్రతి ఇంటికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేరువ చేస్తూ ముందుకు సాగడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం, ప్రతి కుటుంబానికి తెలియజేయాల్సిన బాధ్యత కన్వీనర్లు, రథసారథులదే అన్నారు.

నియోజకవర్గ పరిధిలో 71 సచివాలయాలు, 14 వార్డులున్నాయని, నూతనంగా నియమింపబడిన వీరంతా రెండో విడతగా శనివారం ఉదయం 36, 38, 39 వార్డులు, మధ్యాహ్నం 28, 29, 30, 37 వార్డుల పరిధిలో గల సచివాలయాల గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కలిసి నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు, సలహాలు చేశారు. జగనన్న ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేసి రాబోయే ఎన్నికల్లో శతశాతం స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా 3648 కిలోమీటర్లు నడిచి సమాజంలో గల ప్రతి ఒక్కరిని కలవడమే గాక, ప్రతి సమస్య తెలుసుకుని వారందరికీ భరోసా ఇస్తూ 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించారన్నారు. పదవి చేపట్టిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాలి అన్న ధ్యేయంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. ఇదే సక్రమంగా అమలు చేస్తూ 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులతో పాటు మనందరిపై ఉందన్నారు. శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వీసం రామకృష్ణ, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రెల్లి కుల కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, ఎస్‌కేఎంఎల్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, స్టేట్ డైరెక్టర్లు సబీరా బేగం, కాకి పద్మ, నీలాపు లక్ష్మి, డేవిడ్‌రాజు, కార్పొరేటర్లు బిపిన్ కుమార్ జైన్, కోడూరు అప్పలరత్నం, వార్డు అధ్యక్షులు మాసిపోగు రాజు, నొల్లు పోతుస్వామి, సన్యాసిరావు, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, నాయకులు మారోజు శ్రీనివాస్, ముజీబ్‌ఖాన్, బోని దేవా, కడియం ప్రసాద్, బాబ్జి, కాసారపు వాసు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చైతన్యం.. తగ్గిన వినియోగం

- సత్ఫలితాలిస్తున్న అధికారుల ప్రయత్నం
- తగ్గుతున్న నిషేధిత ప్లాస్టిక్ వాడకం



పూర్ణామార్కెట్‌లో గుడ్డ సంచితో వచ్చిన వినియోగదారుడికి సరుకులు విక్రయిస్తున్న వ్యాపారి



కవర్లు వద్దంటూ గుడ్డ సంచులు ఇస్తున్న ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్



వినియోగంలోకి వస్తున్న పేపర్ కప్పులు, గ్లాసులు, ప్లేట్లు

జగదాంబ: ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెరిగింది. ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో మానవవాళికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ జీవీఎంసీ ఆదేశాలు జారీ చేసింది. సుమారు సంవత్సర కాలంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆదేశాలు కార్యాలయానికే పరిమితం కాకుండా దుకాణాలపై దాడులు, తనిఖీలు చేసి దాదాపు సింగిల్ యూజ్ కవర్లు కనుమరుగయేలా చేశారు. చాలా చోట్ల వ్యాపారులు కూడా కవర్లు తీసుకువస్తేనే సరకులు ఇస్తామని చెబుతున్నారు. అయితే ఇంతటితో ఆగకుండా మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ రాజాబాబు మరో అడుగు ముందుకేసి ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పలు రకాల వ్యర్థాలతో తయారు చేసిన కవర్లను ప్రజలు వినియోగించే విధంగా ప్రధాన మార్కెట్లలో స్టాల్స్ ఏర్పాటు చేశారు.

ఇంటి నుంచే గుడ్డ సంచులు..

ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు అన్న నినాదం ప్రజల్లోకి బాగా వెళ్లింది. ఇప్పుడు ప్రతి ఒక్కరు పాల ప్యాకెట్ నుంచి కూరగాయలు, కిరాణా సరకుల వరకు గుడ్డ సంచుల్లోనే ఇంటికి తీసుకెళ్తున్నారు. 75 మైక్రాన్ల కంటే ఎక్కువ పరిధి గల కవర్లు ఉపయోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నా చాలా చోట్ల ప్రజలు మాత్రం పూర్తిగా సంచులనే వాడుతున్నారు.

దుకాణాల్లో నారసంచులు..

వ్యాపారులు దాదాపు ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు విరమించుకున్నారు. వాటి స్థానంలో నార సంచులు, పేపర్ టీ కప్పులు, ప్లేట్లు, గుడ్డసంచుల అమ్మకాలు చేస్తున్నారు. పూర్ణామార్కెట్ వాణిజ్య సముదాయల్లో ఏ దుకాణాల్లో కూడా సింగిల్ యూజ్ కవర్ల అమ్మకాలు జరగడంలేదు.

సరకులు ఇవ్వడంలేదు..



వినియోగదారులు సంచులు లేకుండా వస్తే కూరగాయలు ఇవ్వడంలేదు. జీవీఎంసీ అధికారుల ఆదేశాల ప్రకారం నార, గుడ్డ సంచులు తెచ్చుకుంటేనే సరకులు విక్రయిస్తున్నాం.

–నాయిని సూర్యనారాయణ, కూరగాయల వ్యాపారి, పూర్ణామార్కెట్.

ఈ డ్రైవ్ ఆగకూడదు



ప్రజల్లో చైతన్యం పెరిగింది. అందరం గుడ్డ సంచులతోనే వస్తున్నాం. ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్లతో సరకులు తీసుకెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ డ్రైవ్ ఇలాగే కొనసాగితే కవర్లు కనబడవు.

–అరుణ్, వినియోగదారుడు, బౌడారారోడ్డు, పూర్ణామార్కెట్

నేడు బీజేపీ కార్యాలయం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ నిరసన

దాబాగార్డెన్స్: 'సిగ్గుపడండి మోదీ గారు' పేరిట నగరంలోని బీజేపీ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్టు ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర మహిళా కన్వీనర్ సీతల్‌మదన్, జోనల్ కో ఆర్డినేటర్ శీర రమేష్‌కుమార్ తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని అతిపెద్ద కుంభకోణానికి ఆదాని పాల్పడ్డారని ఆరోపించారు. ప్రధాని మోదీ సహకారంతోనే ఆదాని ప్రపంచ కుబేరుడిగా మారారని తెలిపారు. ప్రధాని మోదీ తన ప్రియమిత్రుడు ఆదానికి అండగా నిలవడంతోనే అతిపెద్ద స్కాంకు ఆయన పాల్పడ్డారని చెప్పారు. దేశంలోని అనేక పరిశ్రమలు, ఓడరేవులు, ఆదాయాన్ని చేకూర్చే అన్నింటిని ఆదానికి కట్టబెట్టిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. సమావేశంలో నూతి ఉదయ్‌భాస్కర్, బోరాడ యజ్ఞ, షేక్ నాగూర్, భీమిశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జగద్గురు పీఠం, డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సౌజన్యంతో హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.రాజు, డాక్టర్ సిహెచ్.వరప్రసాద్ పర్యవేక్షణలో గుండె వ్యాధుల పరీక్షలు ఈసీజీ, బీపీ, సుగర్, పలు రక్త పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై రక్షణ చర్యలు

- ప్రమాదాల నివారణకు ఫ్లెక్సీలు, రేడియం స్టిక్కర్ల ఏర్పాటు



ప్రమాద స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



మృతుల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



పోలీస్ బీట్‌లో కానిస్టేబుల్

అల్లిపురం : తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై తరచు జరుగుతున్న ప్రమాదాల నివారణకు నగర పోలీసులు చర్యలు చేపట్టారు. ఫ్లైఓవర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 10 నుంచి 12 మంది వరకు దుర్మరణం చెందారు. ట్రాఫిక్ ఏడీసీపీ అరీఫుల్లా, జోన్–1, ఏసీపీ కుమారస్వామి, జోన్–2 ఏసీపీ శరత్ కుమార్, ఈస్ట్ వన్ సీఐ సూరినాయుడు, ఈస్ట్–2 సీఐ షణ్ముఖరావు, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ అధికారులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కారణాలు విశ్లేషించారు. అనంతరం ప్రమాద ప్రాంతం వద్ద గ్లోసైన్ బోర్డులు, ప్రమాదంలో మృతి చెందిన వారి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఒక కానిస్టేబుల్‌ను బీట్ డ్యూటీకి ఏర్పాటు చేసి వాహన చోదకులను అప్రమత్తం చేయనున్నట్లు పోలీసులు, అధికారులు తెలిపారు.

కలియుగ వెంకన్నకు విశేష పూజలు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ పోలీసుల అవగాహన



జగదాంబ కూడలిలో వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్ తదితరులు

దాబాగార్డెన్స్: హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యానికి చేరుకోవచ్చని ఎస్సై ప్రతాప్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం జగదాంబ కూడలిలో హెల్మెట్ ధారణ వల్ల కలిగే ఉపయోగాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు హాని లేకుండా బయటపడొచ్చని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రాఫిక్ రూల్స్‌ని అధిగమించడం, ర్యాష్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలకు గురైతే ఆ కుటుంబాలు తర్వాత పడే బాధలు వర్ణనాతీతమన్నారు. నగరంలోని జగదాంబ కూడలి, ఆర్‌కే బీచ్‌తో పాటు రద్దీ ఎక్కువగా ఉండే అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజూ హెల్మెట్ ధారణపై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ పి.కృష్ణారావు, పీసీలు వెంకటరావు, శంకరరావు, స్వామి, దాసు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి భక్తుల తాకిడి



ఆలయ మండపంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న శ్రీ రాజరాజేశ్వరి భజన మండలి సభ్యులు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు సుప్రభాతసేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్రనామాలతో సహస్రనామాభిషేకం చేపట్టారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత కార్యక్రమం..

సాయంత్రం ఆలయ మండపంలో కంచరపాలెం శ్రీ రాజరాజేశ్వరి భజన మండలి సభ్యులు పాడిన భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారికి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రక్తదానంపై అవగాహన సదస్సు



సర్టిఫికెట్లు పొందిన రక్తదాతలతో బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు

దాబాగార్డెన్స్: రక్తదానంపై శనివారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిలు దుర్గాప్రసాద్, అంజిత, స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, ప్రముఖ సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రక్తదానంపై చాలా మందికి అపోహలున్నాయని, అది ఎంత మాత్రం నిజం కాదన్నారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి రక్తదానం చేయడం వల్ల మనిషి చాలా ఆరోగ్యంగా ఉంటాడని, హెచ్‌బీ 12.5 ఉంటే ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తదానం చేసిన తర్వాత ఆ రక్తాన్ని అనేక పరీక్షలు చేసి పేషెంట్‌కు అందిస్తారన్నారు. ఆ టెస్టుల్లో ఏమైనా వ్యాధులుంటే బయటపడతాయని, ఆ పేషెంట్‌ని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. మెడికల్ ఆఫీసర్ అంజిత మాట్లాడుతూ ఏడాదిలో దేశం మొత్తానికి 14.6 మిలియన్ యూనిట్ల రక్తం కావలని.. అయితే 11.5 మిలియన్ యూనిట్ల రక్తం మాత్రమే లభిస్తుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డాక్‌యార్డ్‌లో ఉద్యోగి మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 58వ వార్డు పరిధి రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువవ కుమార్‌స్వామి నీటిలో మునిగి ఉన్నట్టు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్‌స్వామిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్టు

బీచ్‌రోడ్డు : మూడో పట్టణ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : ప్రతిభ గల తెలుగువారిని గుర్తించి వారికి ఉగాది రోజున పురస్కారాలు అందజేయనున్నట్టు ఈవెంట్ డైరెక్టర్ వీరూ మామ పేర్కొన్నారు. విద్య, వైద్యం, సేవ, నృత్యం, కళలు, సినిమా, సంగీతం, టీవీ, క్రీడలు, విశిష్ట సేవ, యువపురస్కారాలు, ప్రత్యేక జ్యూరీ పురస్కారాలు అందివ్వనున్నామన్నారు. నామినేషన్ల కోసం 70137 35330 నంబర్‌కు పూర్తి వివరాలు మార్చి 15లోగా పంపాలని వీరుమామ తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా ఉగాది పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మతసామరస్య వారోత్సవం నేడు

మద్దిలపాలెం: ఆదివారం నుంచి ప్రపంచ మతసామరస్య వారోత్సవాలను నిర్వహించనున్నట్టు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీస్ ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, గా ంధీ సెంటర్ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు.

keys SELECT BY LEMON TREE HOTELS

TENDER NOTICE

Sealed quotations are invited for the supply of the following items for annual rate contract from **01.04.2023** to **31.03.2024** for our **VISAKHAPATNAM** unit.

1.Vegetables, 2.Fruits, 3. Chicken, 4.Mutton, 5.English vegetables, 6.Frozen Sea Food / Fresh, 7. Eggs, 8.Milk, 9.Ice creams, 10.Sweets & Snacks, 11.Rice, 12.Groceries, 13.Charcoal, 14.Bakery, 15.Canned food products, 16.Aerated Beverages, 17.Packaged Drinking water bottles, 18.Office Stationery, 19.Housekeeping Cleaning Supplies, 20.Tissue Paper & Paper Products, 21.Fuel Gel, 22.Garbage Bags, 23.Scrap lifting, 24. Laundry, 25. Rock salt.

Contracts: Pest Control, Glass Cleaning, Marble & Carpet Cleaning, STP Cleaning services Detailed specifications & tenders' forms can be obtained from the purchase department in our office at Keys Select by Lemon tree Hotel, Dabagardens, Visakhapatnam from **11th Feb 2023** to **28th Feb 2023** during working hours between 10.a.m to 5.00 p.m. on payments **Rs. 500/-** in cash (Non-Refundable). All tenders proposing to apply should be compliant to FSSAI Act/Rules & regulations. Please attach a copy of FSSAI license & GST registration. Sealed tender to be received by **28.02.2023** till 17:00 Hrs. addressed to Materials department. Contact No.**9133398145, P.SURYA DEVA** (Management reserves the right to accept or reject any tender, in part or whole, without assigning any reason thereof.)